


## నా మాట

2023వ సంవత్సరంలో స్వాతంత్ర్య భారతదేశంలో బ్రతుకుతున్న అదృష్టవంతులం మనం. భారతదేశం, భారతీయ సమాజం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతిని సాధించిన తరువాత పుట్టిన మనం, ఎన్నో రకాలుగా మన ముందు తరాల కంటే అదృష్టవంతులం. ముఖ్యంగా మనకు పరాయి పాలనలో బ్రతికినప్పటి భారతీయుల రాజకీయ, సామాజిక పరిస్థితుల గురించి అవగాహన లేదు. అలాగే, ఆనాటి మహిళల జీవితం గురించి కూడా! ఈ అంశాల గురించి సమగ్రమైన నవల వెలువడిందో, లేదో నాకు తెలియదు. అయితే నేను రాసిన ఈ నవలలో ఆ రెండు రంగాలు స్పృశించబడ్డాయి. కథాగమనానికి అవసరమైనంత వరకే వాటిని ప్రస్తావిస్తూ ముందుకి వెళ్ళాను. కారణం పాఠకులకు నవల చదివే ఆసక్తిని దూరం చేయకూడదనే!

ఈ నవల రాయటానికి 2020 ఏప్రిల్ 25న గతించిన, శ్రీ మంచాళ సీతారామారావుగారి భార్య,, మా తల్లి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారు ప్రేరణ.

90 సంవత్సరాల నిండు జీవిత కాలంలో ఆవిడ అప్పుడప్పుడు ఆవిడ చిన్ననాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి మాతో పంచుకున్న జ్ఞాపకాల పరిమళంతో ఈ నవలా సుమం వికసించింది. ఇందులో పాత్రలన్నీ పూర్తిగా కల్పితాలు. జీవించి ఉన్న లేదా మరణించిన ఏ వ్యక్తి తో నైనా ఎవరికైనా పోలికలు కనిపిస్తే అది కేవలం కాకతాళీయకం మాత్రమే. వాస్తవికంగా కనిపించే రచన చేయటం కోసం కొందరు గొప్ప దేశ నాయకుల పేర్లను వాడటం జరిగింది. అది ఈ తరం వాళ్లకు వారి గొప్పదనాన్ని తెలియజేయటానికి మాత్రమే!

ఈ నవల చదివి, జీవితాన్ని ఫలవంతం చేసుకున్న ఓ మహిళా మూర్తి నుంచి, ఏ ఒక్కరైనా స్ఫూర్తి పొందితే దీని ప్రయోజనం సిద్ధించినట్లే. ఆమె గుణగణాలలో సగమైనా పుణికి పుచ్చుకున్న 'మహిళా రత్న'లు నిజంగా ఎక్కడైనా ఉంటే వారికి నా పాదాభివందనం. వారి జీవితమే ఈ "భారతీయం."

ఈ నవలా రచనకు నాతో పాటు, నేను పడినంత కష్టాన్నీ పడి ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులకు, మిత్రులకు కృతజ్ఞతలు చెప్పుకోకపోతే, ఈ నవలను నేను రచించానని చెప్పుకునే
సాహసం నేను చెయ్యలేను.

ఇది నా తల్లిదండ్రులు మంచాళ స్వరాజ్యలక్ష్మి, మంచాళ సీతారామారావు గార్ల దివ్య స్మృతికి చిన్న కూతురు 'చిన్నా' భక్తి ప్రేమలతో ఇచ్చిన పుస్తక నీరాజనం.

(గత సంచిక తరువాయి)

"తప్పేమీలేదు తల్లీ, ఇప్పుడు ఉన్నట్టుండి అంత డబ్బు ఎక్కడనించి వస్తుంది అన్నదే ఆలోచన తప్ప" అన్నాడు పార్వతీశం.

"ఎందుకు నాన్నా ఈ బీద అరుపులు? అయినా ముసలమ్మగారు దాటిపోయిందిగా,
ఆ ఇల్లు అమ్మేస్తే సరి."

"అది అమ్మే ఉద్దేశ్యం ఆవిడకి లేదే." పార్వతీశంగారు అన్నారు.

"అలా అని నీకు చెప్పిందా?"

"అమ్మి ఇమ్మంటానని నీకు చెప్పిందా?" కోపంగా అడిగాడు పార్వతీశం.

"ఆవిడ చెప్పకపోవచ్చు. కానీ దాన్నంతా ఏం చేసుకుంటావు?" తండ్రిని నిలదీసినట్టు అడిగింది రాజేశ్వరి.

"నేనేమన్నా చెయ్యటమేంటి? అసలు నాకు హక్కెక్కడిది? అయినా ఆవిడ ఆస్తి ఏమి చెయ్యాలో వీలునామా వ్రాసిందిట" రాజేశ్వరి మొహం వాడిపోయింది శయనమ్మ వీలునామా వ్రాసినదని వినగానే.

ఆమెకు ఎవరూ లేరు కనుక ఆమె ఆస్తి అమ్మి పార్వతీశం భవిష్యత్తులో కొడుకులకి పంచేస్తాడేమో, ఇప్పుడే తనూ కొంచెం రాబట్టుకుందాం అన్నది ఆమె ఆలోచన.

"రేపు పన్నెండో రోజున అందరి సమక్షంలో అది చదువుతారు, దాన్ని బట్టి చూద్దాం... అదేనా
మాట్లాడాల్సింది, ఇంకేమన్నా ఉందా?"

ఇంకేమీ లేదన్నట్టు తల ఊపింది రాజేశ్వరి.

"సరే, కొంచెం పని ఉంది. బయటకు వెళ్ళి రావాలి. ఏమోయ్, రవీ, నాతో వస్తావా?"

"బట్టలు మార్చుకుని వస్తా బావా." రవి అన్నాడు. పార్వతీశం అంగీకారంగా తల ఊపాడు.

"అమ్మాయ్, వాడికేం కావాలో చూడమ్మా!" అన్నాడు చిన్న కూతురిని ఉద్దేశ్యించి. భర్త వెనుకే వెళ్ళింది భారతి. ఆమెకు అక్క ప్రవర్తన తలవంపులుగా అనిపించింది. రాజేశ్వరి శయనమ్మ గారి డబ్బులలో వాటా అడగటమేమిటి?

"నాన్నా, ముసలమ్మగారు నిజంగా వీలు రాసిందా?"  చెల్లెలు, మరిదితో అటు వెళ్ళగానే అడిగింది రాజేశ్వరి.

"రాసిందటమ్మా. ఇందాక బజారులో మన ప్లీడర్ గారు కనిపించి చెప్పారు. అందులో ఉన్నట్లు అమలు చెయ్యక తప్పదు. రేపు ప్లీడర్ గారు వస్తారుగా. అందులో ఏమి రాసిందో చూద్దాం."

"సరేలే నాన్నా, ఆమె మటుకు ఇంకెవరికి రాసి ఉంటుందిలే. మనకేగా! బతికున్నన్నాళ్ళు ఆవిడ మంచీ,చెడూ చూసి ఆ ఘటాన్ని దాటించేసింది మనమేగా... అలాగే చూద్దాం. రేపు ప్లీడర్ గారు ఎన్నింటికీ వస్తామన్నారు? మేమూ అప్పుడే వస్తాంలే. బాబుని అత్తమ్మ దగ్గర వదిలి వచ్చాం." అంది రాజేశ్వరి లౌక్యంగా

"పొద్దున్నే పదిగంటలకు రండమ్మా. అంతా అయ్యాక, భోజనాలు ముగిశాక చదువుతారు." ప్రశాంతంగా చెప్పారు పార్వతీశం.

"అయినా నువ్వొకటి గుర్తుంచుకోవాలి రాజేశ్వరీ! ముసలమ్మ గారిని మనం చూసుకున్నది ఏమీ లేదు. ఆవిడే మీ అమ్మకు పెద్దదిక్కుగా ఉంది. పురుళ్ళకీ, పుణ్యాలకీ మీ అమ్మమ్మ దగ్గర లేని లోటు తీర్చింది. మీ అందరి పెంపకంలోనూ పెద్దపాత్రే పోషించింది. అసలు సుశీలే కనుక ఇక్కడ ఉండివుంటే ఈ చర్చకు చోటే ఉండేది కాదు. " రాజేశ్వరి బిత్తర పోయింది తండ్రి గొంతులో ధ్వనించినపదునుకి.

"అంతేలే, మరి వస్తాం నాన్నా." భర్తతో సహా కలిసి వెంటనే బయల్దేరింది.

రాజేశ్వరి వెళ్ళిపోయాక ముకుందం, మురారి, హైమవతి ఆందోళనగా ఏదో మాట్లాడబోయారు. పార్వతీశంగారు ఆ విషయాన్నిక వదిలెయ్యమని చెయ్యి ఊపారు. పైనుంచి రవి బట్టలు మార్చుకుని రాగానే మామా అల్లుళ్లిద్దరూ బయటకు వెళ్లారు. తరువాత కొంత సేపటికి ప్రసాద్, మురారి, ముకుందం కూడా బయటకు వెళ్ళొస్తామని వెళ్లారు. ఇంట్లో ఆడవాళ్లే మిగిలారు.

హైమవతి, శారదమ్మ వంక తిరిగి అంది.

“పిన్నిగారు విల్లు ఎప్పుడు రాసిందంటావు వదినా? మనకసలు తెలియదే, ఏమి రాసి ఉండి ఉంటుంది?”

“ఏదైనా ఆవిడ ఆస్తి, ఆవిడ ఇష్టం కదా వదినా. పాపం జీవితమంతా ఆవిడ కష్టాలే పడింది. ఆఖరికిప్రాణం పెట్టి పెంచుకున్న ఆ పెంపుడు కూతురు కూడా పొయ్యేటప్పుడు దగ్గర లేకుండానే పోయింది.”

ఇద్దరు అవునంటే అవుననుకుని పనిలో పడిపోయారు.

రవి బయటకు వెళ్లిన తక్షణమే తమ వాటాలోకి వెళ్లిపోయిన భారతి, మర్నాడు ‘అందరిల్లు”‘లో తానుచేయవలసిన పనుల గురించి జాబితా తయారు చేసుకుంటూ కూర్చుంది. పిల్లలకు చదువు చెప్పటానికి టీచర్లను పిలిచింది భారతి. నలుగురు ఆ రోజు వస్తామన్నారు. అందులో ఎవరన్నా సరైన వారిని ఎంపిక చేస్తే ఆ సమస్య పరిష్కరించబడుతుంది.

ఇక ముసలివాళ్ళు పదిమంది ఉన్నారు.

పార్వతీశం ఇంట్లో పనిచేస్తున్న చిన్న జీతగాడు అడిగాడు. “అమ్మా, మా వాళ్ళు ఇద్దరు ఏ పనీ లేక ఖాళీగా ఉన్నారు. నీ చేతి కింద వేసుకోమ్మా. ఏం చెప్పినా నోరెత్తకుండా చేస్తారు.”
వాళ్ళని కూడా మర్నాడే పంపమంది భారతి.

తన కూతురుకంటే కొంచెం పెద్దవాళ్లు ముగ్గురు పిల్లలున్నారు. తను అక్కడే ఉండి ఆ పిల్లలను చూసుకోవాలి ఎవరన్నా దొరికేదాకా.
ఈ పనులన్నీ ఇలా ఉండగా ఈ వీలునామా చికాకు ఒకటి. రేపు రాజేశ్వరి ఎంత పెద్ద దుమారం రేపుతుందో. ఆలోచిస్తుంటే మనశ్శాంతి పోయింది భారతికి. చివరికి కానున్నది కాక మానదనే నిర్ణయానికి వచ్చాక ఆమె మనసు ప్రశాంతతను పొందింది.

రవి, పార్వతీశం ఆ రాత్రి ఇల్లు చేరేసరికి చాలా పొద్దు పోయింది.

రవి పైకి రాగానే, "భోజనం చేస్తారా?" అంది భారతి. ఈ మధ్య పట్టుపట్టి భర్తను మన్నించటం నేర్చుకుంటోంది తల్లి తిడుతోందని. కానీ మావయ్యా అనే వస్తుంది అలవాటుగా. పైగా రవికీ అదే ఇష్టం.

"ఏమి వండావు?" అన్నాడు రవి.

"ఏమి ఉంటాయి? బీరకాయ పచ్చడి, చారు, బెండకాయ కూర, మజ్జిగా... "

"ఎబ్బే, వీటితో తినాలంటే నువ్వు కలిపి ముద్దలు పెడతానంటేనే." గారాలు పోయాడు రవి.

"దేనితో అయితే మీ అంతట మీరు తింటారో చెప్పండి" నడుం మీద చెయ్యి పెట్టుకుని ప్రశ్నించింది భారతి పెదాలు ముద్దుగా బిగిస్తూ.

"నీకు లోకువైపోయానోయ్. అమృతమైనా సరే నువ్వు పెట్టాలి, నేను తినాలి. అంతే. పరీక్షలప్పుడు అలవాటు చేసింది ఎవరటా?" గునిసాడు రవి.

"మహానుభావా! ఆ పరీక్షలయ్యి ఎంత కాలమైందంటా? ఒళ్ళు బరువెక్కితే తిండికూడా భార్యే నోటికి అందించాల్సి ఉంటుంది, పదండి. వేడివేడిగా కారం అప్పడాలు వేయిస్తా, చారులో నలుచుకోవచ్చు. త్వరగా స్నానం ముగించి రండి." తువ్వాలు అతని భుజంమీద వేసి స్నానాలగది వైపు నెట్టింది భారతి. నవ్వుకుంటూ వెళ్ళాడు రవి.

★★★★★

మర్నాడు భోజనాలయ్యి అందరూ ఒకచోట చేరేసరికి రెండయ్యింది. అనంతరం శయనమ్మగారి గురించి మాట్లాడమన్నాడు పురోహితుడు. ఊళ్లోని పెద్దమనుషులు ఒక ముగ్గురు నలుగురు ఆవిడతో తమపరిచయం గురించి, తమకు ఆవిడ సహాయపడ్డ వివరాల గురించి ఎంతో చక్కగా మాట్లాడారు.

ఇంట్లోవాళ్ళనించి పార్వతీశం మాట్లాడి, మిగిలిన కుటుంబసభ్యులను మాట్లాడమని ప్రోత్సహించాడు. కృష్ణచాలా చక్కగా తరగతి గదిలో పాఠం చెప్పినంత వివరంగా శయనమ్మ వ్యక్తిత్వాన్ని స్పృశిస్తూ మాట్లాడాడు.

రవి, భారతిని మాట్లాడమని ప్రోత్సహించాడు. ఆ రోజుల్లో అటువంటి సందర్భాలలో ఆడవాళ్లు అందరిలోమాట్లాడటం అరుదే!

భారతి శయనమ్మగారి జీవితాన్ని గురించి క్లుప్తంగా చెప్పి, అటువంటి పరిస్థితులలో కూడా ఆవిడ సంఘసేవ చేసిన తీరును ఎన్నో విధాల పొగిడింది. ఆవిడ ఆఖరి ఊపిరి తీసుకునేముందు తనని సాంఘికసేవవైపు మళ్లించిన తీరు, అందుకు రవి ప్రోత్సాహం గురించి చెప్పింది. చివరికి ఆవిడ ఆశయాల అడుగులలోనే తానూ నడుస్తానని, తప్పులు జరిగితే సరిదిద్దమని కోరుతూ ముగించింది. అందరూ శయనమ్మగారి ఆఖరిమాటలను విని కన్నీరు కార్చారు. భారతిని తప్పకుండా 'అందరిల్లు'ను అభివృద్ధి చెయ్యమని, దానికి తమందరి సహకారం ఉంటుందనీ మద్దతు పలికారు.

రవి మాట్లాడాడు. భారతి కనుక, 'అందరిల్లు' నిర్వహణ తలకెత్తుకుంటే తను ఆ ప్రయత్నంలో భారతికి నూటికి నూరు పాళ్ళు సహాయసహకారాలు అందిస్తానని, దానికి కావలసిన డబ్బులు కూడా అవసరమైతే తమ సొంతడబ్బులలోంచి సమకూర్చటానికి వెనుకాడమని చెప్పాడు.

చివరికి అసలు ఘట్టం రానే వచ్చింది. వకీలు తన చేతిసంచీలోంచి శయనమ్మగారి వీలునామా బయటకు తీశాడు. నిజానికి దానిమీద ఎవరికీ ఆసక్తి లేదు ఒక్క రాజేశ్వరికి తప్ప.

శయనమ్మ ఆస్తిపాస్తుల వివరాలు పార్వతీశంకే తెలియవు. కానీ రాజేశ్వరికి కొంతవరకూ తెలుసు. రాజేశ్వరి చిన్నతనంలోనే ఆవిడతోపాటు బాంకుకు సాయంవెళ్లే సమయంలో ఒకసారి ఆవిడ భద్రపరుస్తుండగా ఆవిడ నగలను చూసింది. అందులో లేని నగ లేదు. ఆవిడకు తన సొంత ఊరిలో, అత్తగారి ఊరిలో ఉన్న భూములు కౌలుకివ్వగా పెద్ద మొత్తంలోనే అయివేజు వచ్చేదని రాజేశ్వరికి తెలుసు. కాకపోతే ఎక్కడ ఎన్ని ఎకరాల భూమి ఉందో తెలియదు. ఈ ఊళ్ళో కూడా పొలం కొన్నదని ఆవిడ పోయాకే తెలిసింది. వకీలుగారు చదివిన వీలునామాలో ముఖ్యమైన సంగతులు విని రాజేశ్వరి మతి పోయింది.

తనకు విజయవాడ, గుంటూరు, తెనాలిలలో ఉన్న వెయ్యిగజాల ఇళ్ల స్థలాలు మూడింటినీ అమ్మి ఒక మూలధనంగా ఏర్పరచి దానిమీద వచ్చే వడ్డీని, విధవావివాహం చేసుకున్న జంటలకు, మూడేళ్ళ వరకు నెలకు యాభై రూపాయల చొప్పున చెల్లించాలి.

అలాగే ప్రతి సంవత్సరం కులాంతర వివాహాలు చేసుకునే ఆరు జంటలకు ప్రోత్సాహక బహుమతిగా తను పెద్దబజారులో కట్టించి అద్దెలకిచ్చిన కొట్ల సముదాయం మీద వచ్చే అద్దె నుంచి ఐదు వందల రూపాయల చొప్పున చెల్లించాలి.

ఇక తన జవహరీనుంచి తనకు ఇన్నాళ్లు కన్నకూతురి ప్రేమను పంచి ఇచ్చిన హైమవతి, ఆరుపేటల చంద్రహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలి. తన బాలతొడుగుతో సహా మిగిలిన నగలన్నీ, తనవి, సుశీలవి కూడా అమ్మి ఆ డబ్బును భారతి పేర బ్యాంకులో వేసి దానిమీద వచ్చే వడ్డీని, 'అందరిల్లు' నిరవధిక నిర్వహణకు ఉపయోగించాలి.

సుశీల 'అందరిల్లు' పేర వ్రాసి తనను ట్రస్టీగా ఉంచిన ఆస్తులన్నిటికీ ఇకమీదట భారతి ట్రస్టీ అవుతుంది.

తనపేరుమీద వివిధ గ్రామాల్లో ఉన్న సుక్షేత్రాలయిన పొలాలు మొత్తం భారతికి చెందుతాయి. ఆమె వాటిమీద ఆదాయాన్ని కానీ, అవసరమైతే వాటిని అమ్మి కానీ స్త్రీ శిశుసంక్షేమానికి, ప్రజా ఆరోగ్యానికి, ఇతర పౌరవసతుల కల్పనకు ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఉపయోగించవచ్చు.
భారతి మనస్ఫూర్తిగా, నిబద్ధతతో ఈ కార్యక్రమాలనన్నిటినీ తన జీవితపర్యంతం నిర్వహించాలి.
ఆస్తులు వేటినీ భారతి తన జీవితకాలంలో తన ఆప్తులెవ్వరికీ సంక్రమింప చేయడానికి వీలులేదు. తన తదనంతరం ట్రస్టీలుగా ఉండటానికి తను ఎవరిని అర్హులనుకుంటుందో వాళ్ళ పేర వీలునామా వ్రాసే అధికారం మాత్రమే ఆమెకు ఉంది.

వీలునామా విన్న అందరూ నిశ్చేష్టులయ్యారు, ఒకటి శయనమ్మగారికి అంత ఆస్తి ఉందని తెలియనందునా, రెండోది ఆవిడ అంత పకడ్బందీగా విల్లు రాసినందునా. ఆ వీలునామాకి మొదటి సాక్షిసంతకం సుశీలది. మిగిలినవి పార్వతీశం కుటుంబంతో ఎటువంటి సంబంధం లేని ఊళ్లోని నలుగురు పెద్ద మనుషులవి. అంటే ఈ వీలునామా రాయించింది సుశీలన్నమాట.

భారతి ఒక్కసారి గట్టిగా ఏడ్చేసింది. “నన్నిలా కట్టి పడేశావా అమ్మమ్మా!” అంటూ. నిజానికి రవికూడా ఆశ్చర్యపోయాడు. భారతిని శయనమ్మగారు నమ్ముతుందని అతనికి తెలుసు. ఎన్నో సందర్భాలలోఅతనితో ఆవిడ ఆ మాట చెప్పింది కూడా. కానీ ఆ నమ్మకం ఈస్థాయిలో ఉంటుందని అతను కూడాఊహించలేక పోయాడు.

మరోగంటలో అందరూ వెళ్ళిపోయారు.

అప్పటివరకూ మౌనంగా ఉన్న రాజేశ్వరి కేవలం ఇంట్లో వాళ్ళందరూ ఉండగా అంది.

“ముసలమ్మగారు ఎంత పని చేసింది? ఇలా అవుతుందనుకుంటే నేనూ రోజూ వచ్చి భారతి కంటే ఎక్కువసేవలే చేసేదాన్ని ఆమెకి” అందరూ నివ్వెరపోయారు. భారతి చివ్వున తలెత్తి చూసింది. ఎక్కువగా ఏడవటం వలన ఆమె మొహం జేవురించి ఉంది. ముందుగా తేరుకుంది నాగరాజే.

“రాణీ, బాధలో నువ్వేం మాట్లాడుతున్నావో నీకే తెలియట్లేదు. మనం ఇంటికి వెళదాం పద.”

“వెళ్ళక, ఇక్కడ ఉండి చేసేదేముంది?” అణుచుకున్న అక్కసు అంటా బయటకు వచ్చి, భర్త మీద దయ్యం పట్టినట్లు అరచింది రాజేశ్వరి.

“భారతి ఆవిడకి మనవరాలు, నేను కాని దాన్ని అయ్యానా? అది ఎలాంటి దగ్గర చుట్టం? దాని పేరున ఎందుకు రాసింది ఆస్తి అంతా? ఇందులో ఏదో కుట్ర ఉంది.”

పార్వతీశం గారికి కోపం వచ్చింది.

“రాజూ, ఏం మాట్లాడుతున్నావు? ముసలమ్మగారికి ముందునుంచి భారతి మీద నమ్మకం ఉందని అందరికీ తెలుసు. భారతికి వ్రాసిందంతా సంక్షేమానికే. భారతి కేవలం ట్రస్టీ అని మరిచిపోకు.”

తల ఎగరేసి నవ్వింది రాజేశ్వరిపొగరుగా.

“అదే, ఆ ట్రస్టీగానే మీ పేరుగానీ, నా పేరుగానీ పోనీ ఇంట్లో ఇంకొక్కరి పేరు గానీ ఎందుకు

రాయలేదు? ఏదో మోసం ఉంది ఇందులో. పోనీ నేను పెళ్ళై ఇంట్లోంచి వెళ్ళిపోయాను అనుకుందాము. నా అన్నదమ్ములు ఉన్నారు. వాళ్ళెందుకు పనికి రాలేదు?"

"రాజూ, మా అందరి తరఫునా నువ్వు మాట్లాడొద్దు. నీ వకాల్తా మాకు అక్కరలేదు. నీ గురించి నువ్వు మాట్లాడుకో" ముకుందం కోపంగా అన్నాడు.

"ఏరా, నీదీ అదే మాటా?" మురారి వైపు చూస్తూ అడిగింది రాజేశ్వరి. అవునన్నట్టు తల ఊపాడు మురారి.

"సరే కందకులేని దురద కత్తిపీటకు దేనికనీ! అయినా వాళ్ళ గురించి నాకెందుకు? నాన్నా, మీరు చెప్పండి. మీకీ వీలునామా గురించి తెలుసా?"

"నాకెలా తెలుస్తుంది రాజూ? ఆవిడ పోయాక ఇవాళే వినటం "

"నేను నమ్మను" కచ్చగా అంది రాజేశ్వరి.

"అది నీ ఇష్టం. అయితే ఇక్కడ నువ్వు గుర్తించాల్సింది ఒకటి ఉంది. అదేమిటంటే ఆవిడ ఆస్తి మీద మన ఎవరికీ ఎలాంటి హక్కు లేదు. ముసలమ్మ గారికి భారతి తన ఆస్తులు సద్వినియోగం  చేస్తుందన్ననమ్మకం ఉండబట్టే, దాన్ని ట్రస్టీ గా ఉంచింది."

"అంటే మీ మీద కూడా నమ్మకం లేనట్లేగా!" పుల్లవిరుపుగా అంది రాజేశ్వరి.

"నువ్వెలా అనుకున్నా అభ్యంతరం లేదు. నా వయసు దృష్ట్యా కూడా ఆవిడ భారతిని ఎన్నుకుని ఉండొచ్చు." శాంతంగా జవాబిచ్చాడు పార్వతీశం.

"రాణీ, ఇప్పుడేమయ్యిందనీ? పెద్దవాళ్ళతో అలాగేనా మాట్లాడేది? పద పోదాం." నాగరాజు సర్దిచెప్పబోయాడు.

“ఏమయ్యిందంటారేమిటండీ? మనకి ఆస్తులేవీ లేవు. ఈ ముసలామె నా పేరున కూడా ఏమన్నా రాస్తుందేమో, మన స్థితి మారిపోతుందని, దరిద్రం వదిలిపోతుందనీ ఆశ పడ్డాను.  కడుపునిండిన వాళ్ళు ఎన్నైనా చెప్తారు. మేడల్లో ఉండేవాళ్ళకి గుడిసెల్లో వాళ్ళ బాధలు ఎలాతెలుస్తాయి?” అక్కసుగా అంది రాజేశ్వరి.

“రాజేశ్వరీ, నాది గుడిసెస్థాయి అని నీకు పెళ్ళికి ముందే తెలుసు. కోరి చేసుకుని ఇప్పుడు బాధపడి ఏంప్రయోజనం?” దెబ్బతిన్నట్లు అన్నాడు నాగరాజు.

“మీది గుడిసెస్థాయి అయితే అక్కడే ఉండిపోవాలా?” విసుగ్గా అంది రాజేశ్వరి. ఉక్రోషంతో ఆమె కళ్ళల్లో నీళ్లు వస్తున్నాయి. ఆఖరికి భర్తకూడా తనను సమర్థించటంలేదు.

“అక్కర్లేదు. కానీ మనం పైకి రావటానికి ఇంకోళ్ళ దయ దేనికి? కష్టపడి పైకి రావొచ్చు కదా! ఇప్పుడుమనం గుడిసెనుంచి పెంకుటిల్లు స్థాయికి రాలేదా?” నవ్వుతూ తేల్చేయబోయాడు నాగరాజు.

అందరి ముందూ భార్య అలా గొడవకు దిగడం అతనికి తలవంపులుగా ఉంది. రాజేశ్వరిలో ఇంత ధనకాంక్ష ఉందా?

“ఎప్పటికీ?” ఆక్రోశంగా అంది రాజేశ్వరి. “అప్పటికి నేను ముసలిదాన్నై పోతాను.” నాగరాజు సహనం హద్దులు దాటింది.

“రాజేశ్వరీ, మనం ఈ విషయాలు మనింట్లో అయినా మాట్లాడుకోవచ్చు. నువ్విక్కడ మాట్లాడాల్సిన పనిలేదు. ఇక పద. చేసిన రాద్ధాంతం చాలు. ఇంటికి నడు,” కొంచెం గట్టిగా, అసహనంగా అన్నాడు.

అతని మొహంలో కోపం చూసి రాజేశ్వరి తగ్గింది. ఎవ్వరికీ ‘వెళ్ళొస్తాను’ అని కూడా చెప్పకుండా గుమ్మందాటి వెళ్ళిపోయింది. వెళ్ళేముందు భారతిని మటుకు చాలా కోపంగా చూసింది. ఆ చూపులకు శక్తి ఉంటే భారతి అక్కడికక్కడే భస్మమయ్యేది !

ఒక పెద్దవాన కురిసి తగ్గినట్టయ్యింది అక్కడ. భారతి పార్వతీశం వంక చూసింది. ఆయనకూడా కూతురివంకే చూస్తున్నాడు.

"ఈ ద్వేషానికి నేను తగినదాన్నేనా నాన్నా? నా తప్పేముంది?" బేలగా అంది భారతి.

పార్వతీశం కూతురి దగ్గరకు వచ్చి విరక్తిగా అన్నాడు "భారతీ, డబ్బు లీలలలో ఇది ఒకటి. బంధువుల మధ్య చిచ్చుపెట్టటం. తెలుసుకో, కొంతమందికి డబ్బుని మించిన బంధువులు ఈ లోకంలోనే ఉండరు. కాకపోతే నాపెంపకంలో పెరిగిన పిల్ల ఇలా తయారవుతుందని నేను  అనుకోలేదు. ఇది నా పెంపకంలో లోపమా! రాజేశ్వరి ఎప్పుడూ నా అంచనాలకుఅందడం లేదు." ఆయనమొహంలో పెద్దకూతురు చేసిన యాగీపట్ల అసహనం, చిన్నకూతురు పడుతున్న యాతన పట్ల వేదన స్పష్టంగా ప్రతిఫలించాయి.

"దాని మొహం, అదేదో ఉక్రోషానికి అంది కానీ భారతీ, ఇదేమన్నా నీ పేరున పెట్టిన ఆస్తా? నీకు అప్పగించిన బాధ్యత" మురారి అనునయంగా అన్నాడు.

"ఔను చెల్లాయి, నువ్వేం బాధ పడకు. అంత పెద్ద బాధ్యతను అది నిర్వర్తించలేదు అసలు. అందుకే అమ్మమ్మ నిన్ను ఎన్నుకుంది," ముకుందం ఓదార్చాడు చెల్లెలిని. భారతి మనసు శాంతించలేదు.

శారదమ్మవైపు చూసింది.

"అదే రెండు రోజుల్లో సర్దుకుంటుంది లేవే. దాని ఆవేశం మనం ఎరిగిందేగా!" అనునయంగా అంది శారదమ్మ. నోరు తెరవంది హైమవతి మాత్రమే. ఇది అందరూ గమనించి ఆశ్చర్యపోయారు. ఆమె మాతృహృదయం రాజేశ్వరి బాధ చూసి తల్లడిల్లి పోయింది. దుర్యోధనుడిలో దుర్గుణాలు తెలిసినా దృతరాష్ట్రుడి ప్రేమలో మార్పు లేదు కదా! కన్నప్రేమ గుడ్డిదని ఊరికే అంటారా? ఆమెకు ట్రస్టీగా నైనా సరే, ఆస్తి మొత్తం భారతి పేరుమీద వ్రాసే బదులు శయనమ్మగారు రాజేశ్వరి పేరు మీద కూడాఎంతోకొంత వ్రాసివుంటేనే బాగుండేదనిపించింది. ఆవిడ ఆలోచనలు వక్రమార్గాన నడవటం మొదలు పెట్టాయి.

## 36

శయనమ్మ గారు పోయి ఆరు నెలలు దాటిపోయింది. రాజేశ్వరి తండ్రి మీద కోపంతో, చెల్లెలి మీద అసూయతో ఈసారి పురిటి పుట్టింటికి రాలేదు. హైమవతే పెద్దకూతురు ఇంటికి వెళ్లి మనవడి ఆలనా పాలనాచూసి వస్తోంది రోజూ.

స్వతంత్ర భారతదేశంలో మొట్టమొదటిసారి ఎన్నికలు జరగబోతున్నాయి. అప్పటివరకూ కాంగ్రెస్ ఒక్కటే జనం అందరికీ తెలిసింది. అయితే ఎన్నికలలో పాల్గొనటానికి సి పీ ఐ ప్రధాన ప్రత్యర్థిగా నిలిచిందికాంగ్రెస్‌కి. కాడి, జోడెద్దుల గుర్తుతో భారత జాతీయ కాంగ్రెస్; కొడవలి, ధాన్యం గుర్తుతో సి పీ ఐ, ఈ రెండూప్రధానపక్షాలైన ఎన్నికల్లో మరెన్నో రాజకీయపక్షాలు పాల్గొని పోటీ పడటానికి సిద్ధమయ్యాయి.

అందరూ అనుకున్నట్టుగానే కాంగ్రెస్ పార్టీ పక్షాన ఎన్నికల్లో అభ్యర్థిగా నిలబడటానికి పార్వతీశానికిఆహ్వానం వచ్చింది. ఇప్పుడంటే ఎన్నికల్లో పోటీ చెయ్యదలచిన అభ్యర్థులు తమకు సీట్ ఇవ్వమని పార్టీ ఆఫీసుల చుట్టూరా తిరుగుతున్నారు కానీ అప్పటి పరిస్థితి అది కాదు.
పురప్రముఖులందరూ రోజూ ఆయన ఇంటికి వచ్చి ఎన్నికల్లో పోటీ చెయ్యమని ఒత్తిడి చేయసాగారు.

పార్వతీశం ఎటూ నిర్ణయించుకోలేని స్థితిలో ఉన్నాడు. ఆయనకు ప్రజాసేవ చెయ్యటానికి పదవి అవసరమా అని ఒక వైపు, అధికారం ఉంటే ప్రజలకి ఇంకా ఎక్కువ సేవ చేయొచ్చేమో అని మరోవైపు అనిపిస్తూ ఉండటంతో ఏ విషయం తేల్చుకోలేని మీమాంసలో ఉన్నాడు. ఇంట్లో వాళ్ళందరూ పోటీ చెయ్యమని సలహాఇస్తున్నారు. నామినేషన్ వేసే సమయం దగ్గర పడుతోంది.

ఆరోజు ఊరిపెద్దలతో మాట్లాడి పార్వతీశం ఇంటికి వచ్చేసరికి వరండాలో వాతావరణం తేడాగా ఉంది. ఏమిటా అనుకుంటూ లోపలకు వచ్చాడు అయన. ఎదురుగా రాజేశ్వరి, నాగరాజు కూర్చుని ఉన్నారు. నాగరాజు చేతిలో నెలల బాబు ఉన్నాడు. ఒకరకమైన ఉద్విగ్న వాతావరణం ఉందక్కడ. రాజేశ్వరి, నాగరాజుకాఫీ తాగుతున్నారు.
పార్వతీశంని చూసి నాగరాజు, “బాగున్నారా మావయ్యా?” అన్నాడు లేచి నిల్చుని కొంచెం మొహమాటంగా. తలూపాడు పార్వతీశం చిరునవ్వుతో బాబుని అందుకుంటూ.

“పేరేంటి?”

“రామ శ్రీనివాస్. రాము అంటున్నాము.” చెప్పాడు నాగరాజు.

రాజేశ్వరి తండ్రిని చూసి ముందుకి వచ్చి, “మా మావగారి పేరు నాన్నా. ఎలా ఉన్నారు నాన్నా? ఏంటీచిక్కినట్లున్నారు?” అంది ప్రేమగా.

"అదేంలేదమ్మా, నేను బాగానే ఉన్నాను" అంటూ "హైమవతీ, అమ్మాయికి, అల్లుడికి ఏం పెడుతున్నావు?" అంటూ లోపలకు వెళ్ళాడు పార్వతీశం బట్టలు మార్చుకునేందుకు.

మరో ఐదు నిమిషాల్లో ఆయన వరండాలోకి వచ్చేసరికి హైమవతి రాజేశ్వరికి, నాగరాజుకి చేగోడీలు, మినపసున్ని పళ్ళెం అందిస్తోంది. మరో పళ్ళెంతెచ్చి పార్వతీశం చేతికి ఇచ్చింది శారదమ్మ. పక్క గదిలో ఉన్నమురారి బయటకు వచ్చాడు.

"ఎప్పుడొచ్చావు అక్కా?" అని రాజేశ్వరిని పలకరిస్తూ ఓ మూల ఉన్న వార్తాపత్రిక అందుకుని అక్కడే ఓ కుర్చీలో కూర్చున్నాడు.

ముకుందం అప్పటికే అక్కడ కూర్చుని ఉన్నాడు. ఎన్నడూ లేనిది హైమవతికూడా అక్కడే కూర్చుని వత్తులు చేస్తోంది. అందరూ దేనికోసమో ఎదురుచూస్తున్నట్లు ఉంది వాతావరణం.

"ఏం, రాజూ, ఏమిటి కబుర్లు?" చేగోడీలు నములుతూ అడిగాడు పార్వతీశం. శయనమ్మ గారు పోయినప్పటి గొడవ తరవాత రాజేశ్వరి మళ్ళీ పుట్టింటికి రాలేదు ఇప్పటివరకూ.. ఇదే రావటం. మధ్యలో ఒక్కసారి భారతికి మటుకూ పాండురంగస్వామి గుడి దగ్గర కనిపించి ఆరోజు తను దురుసుగా మాట్లాడినందుకు ఏమీ అనుకోవద్దని నాగరాజు చెప్పమన్నాడని చెప్పింది. భారతి నవ్వేసింది.

"నేనేమీ అనుకోను అక్కయ్యా, నీ మాటలు నాకు అలవాటేగా, "అంది.

"నాకు తెలుసే, కానీ మీ బావే ఆరోజునించి తెగ బాధపడిపోతున్నారు భారతి ఏమనుకుందో నని," అంది రాజేశ్వరి అదేమంత పెద్దవిషయం కాదన్నట్లుగా.

"చెప్పమ్మా! చాలారోజులైంది మీరు వచ్చి. ఏం అల్లుడుగారూ, అమ్మా,నాన్నా కులాసాయేగా?" చాలారోజుల తరువాత కూతురుని చూడటం ఆనందంగా అనిపించింది పార్వతీశానికి. రాజేశ్వరి కళ్ళల్లో కొద్దిగా జంకు కనిపించింది పార్వతీశానికి.

"ఏంలేదు నాన్నా, వచ్చే అక్టోబర్లో లోక్‌సభకు ఎన్నికలంటున్నారు?"

"ఔనమ్మా. మొట్టమొదటిసారి జరగబోతున్నాయి. మన ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు." గర్వంగా అన్నాడు పార్వతీశం.

"ఆ ఎన్నికలలో నేను పోటీ చేద్దామనుకుంటున్నాను." వింటున్న ముకుందం, మురారి ఉలిక్కి పడ్డారు. లోపల్నించి మంచినీళ్లు తెస్తున్న హైమవతి గుమ్మం లోపలే ఆగిపోయింది.

" శుభం, మంచిదమ్మా. ఏ పక్షం తరఫున?"

"కాంగ్రెస్ అయితే బాగుంటుందని అనుకుంటున్నాను నాన్నా. కానీ పార్టీ కార్యాలయంలో వాకబు చేస్తే..." నీళ్లు నమిలింది రాజేశ్వరి, "...ఇక్కడనించి మిమ్మల్ని పోటీ చేయిద్దామని అనుకుంటున్నారని తెలిసింది..."

"...వారు అడుగుతున్నారమ్మా. నేనింకా నిర్ణయించుకోలేదు," పార్వతీశం నవ్వుతూ చెప్పాడు.

"నిర్ణయించుకోక పోవటం ఏమిటి నాన్నా? రేపు వెళ్ళి నామినేషన్ వేద్దామని అంటే, సరే అన్నారుగాపొద్దున్న?" ఆవేశంగా అన్నాడు మురారి.

"అవును నాన్నా, ఊరి ప్రజల కోరిక, మీరు నిలబడాలని." ముకుందం అన్నాడు. రాజేశ్వరి మొహం నల్లబడింది.

"మీరు నిల్చుంటానంటే సరేలే నాన్నా." నిరాశగా అంది.

"అవును, నాన్నే కాంగ్రెస్ అభ్యర్థి. నువ్వు కావాలంటే స్వతంత్రంగా పోటీచేసుకో." మురారి అన్నాడు. అతనికీ మధ్య ఆవేశం పాలు హెచ్చుతోంది బాగా.

"చిన్నోడా!" అన్నాడు పార్వతీశం మందలింపుగా.

"మీరే చెప్పండి నాన్నా. మీరు చెప్పింది నాకు శిరోధార్యం," తండ్రినే చూస్తూ అడిగింది రాజేశ్వరి.

"నేను మాట్లాడతానమ్మా. నువ్వైతేనేమి, నేనైతేనేమి? ఒకే కుటుంబం వాళ్ళం కదా. ఎవరమైనా ప్రజలకు సేవ చెయ్యటమే కదా చేసేది! నువ్వే పోటీ చేద్దువుగాని."

రాజేశ్వరి మొహం వెలిగిపోయింది. గుమ్మంలో కూర్చుని పూలు కడుతున్నట్లున్న హైమవతి మొహం కూడా. నాగరాజు ఆనందంగా చూసాడు. మురారి, ముకుందం తాము విన్నది నమ్మలేనట్లు చూశారు.

"కరపత్రాలు తయారుచేశాం ముద్రణకివ్వటానికి. ఏం చెయ్యాలి వీటిని?" కోపంగా అడిగాడు మురారి.

నిర్మలంగా నవ్వాడు పార్వతీశం.

"వాటిలో నాపేరు బదులు అమ్మాయి పేరు రాయండిరా. పార్టీ ఒప్పుకోగానే ముద్రణకిద్దాం. అమ్మారాజూ, పొద్దున్నే పదింటికల్లా రండి. మనం పార్టీ ఆఫీస్ కి వెళదాం. అక్కడి వారితో మాట్లాడి నీ అభ్యర్థిత్వాన్నిఖరారు చేసే పూచీ నాది. సరేనా?"

హైమవతి లోపల్నించి మిఠాయి తెచ్చింది. "నా కూతురు శాసనసభ సభ్యురాలవుతుందన్న మాట.ఎంత పరువూ, ఎంత ప్రతిష్ఠ!" ఆమె మొహం చందమామ కాంతులతో వెలిగిపోతోంది. ఆమె మొహంలోకి లోతుగా చూసాడు పార్వతీశం. హైమవతి తడబాటుగా చూపు తిప్పుకుని కూతురికి మిఠాయి తినిపించింది.

నవ్వుకున్నాడు పార్వతీశం.

"రేపు పదిగంటలకల్లా వచ్చేస్తాం నాన్నా," తండ్రి కాళ్ళకి నమస్కారం చేసి బయటకు నడిచింది రాజేశ్వరి. నోళ్లు తెరుచుకుని చూస్తూ ఉండిపోయారు ముకుందం, మురారి.

"ఏమిటి నాన్నా ఇది? అలా మాట ఇచ్చేసారు?" పార్వతీశంని అడిగాడు మురారి కోపంగా.

"ఏముందిలే నాన్నా. దానికి పోయినసారి, 'అందరిల్లు' ట్రస్ట్ విషయంలోనే మనసుకు

కష్టమనిపించింది. తను అర్హురాలిని కానా అని బాధపడింది. ఇది దానికో అవకాశం అనుకుందాం. ఆ రోజు తరువాత ఇప్పుడే కదా ఇంటికి వచ్చింది. అదీ మనపిల్లేరా. దానికి మటుకు ప్రజాసేవ చేసే అవకాశం ఇవ్వద్దూ?"

"నాన్నా, ప్రజలకు చెయ్యాల్సింది సేవ. అది పదవి ఉంటేనే చెయ్యగలరా? ఇన్నాళ్లు మీకే పదవి ఉందని ఇన్ని చేశారు? మీరు వీధివెంట నడుస్తుంటే జనాలు లేచి నిల్చుంటారంటే, ఎంత పేరు సంపాదించుకున్నట్టు మీరు? ఆ పేరు అక్క నిలబెట్టగలదా? మీ కూతురన్నది  కాక తనకి వేరే ఏముంది?" పార్వతీశం జవాబిచ్చే ముందు ఒక్క క్షణం ఆగాడు.

"మురారీ, నువ్వన్నది నిజమైతే నాకు ఇప్పుడుమటుకూ పదవి ఎందుకు? చెయ్యగలిగిందేదో ఇన్నాళ్లకు మల్లేనే చేస్తాను. నాకూ ప్రజాసేవలో రాజేశ్వరి ఎంతవరకూ సఫలమవుతుందని కొంత అనుమానం ఉంది. కానీ ప్రయత్నించక తప్పదు. ఈ ఎన్నికలు ఐదేళ్లకే. ఒకవేళ రాజేశ్వరి తగిన అభ్యర్థి కాకపోతే, ప్రజలే వచ్చేసారి ఎన్నుకోరు. ఎటుతిరిగీ నేను ఎన్నికైతే నాకిచ్చే సహకారాన్నే దానికి ఇవ్వండి. దానిపనితీరుని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, తేడాలుంటే హెచ్చరిస్తుండండి."
తండ్రి మాటలకు తల వంచారు ముకుందం, మురారి.

(తరువాయి వచ్చే సంచికలో)

COMMENTS